సాక్షి
కుమురం భీం
శనివారం । 24 । మే । 2025

సెలవుల్లో.. శాశ్వత సెలవు



నీటి కుంటలో మునిగి ఇద్దరు బాలికలు మృతి చెందిన ఘటన కౌటాల మండలం తాటిపల్లి గ్రామంలో విషాదం నింపింది. కన్నబిడ్డలు విగతజీవులుగా పడి ఉండటం చూసి తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు. విషయం తెలుసుకున్న సమీప గ్రామాల నుంచి ప్రజలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆడుకునే వయస్సులోనే చిన్నారులకు నూరేళ్లు నిండాయా అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

- వివరాలు 10లో▸

న్యూస్‌రీల్

విద్యార్థులకు సన్మానం



సన్మానిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా నెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అలీబిన్ మాట్లాడుతూ నెట్‌బాల్ బాల్ ట్రెడిషన్‌లో జిల్లా కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు సాయిదీక్ష, రోహాన్, ఫాస్ట్ ఫైలో వంశీవర్ధన్ ప్రతిభ చూపారని తెలిపారు. జాతీయస్థాయిలో క్రీడాకారులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ జిల్లా కార్యదర్శి తిరుపతి, నాయకులు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న పార్ట్‌టైం స్వీపర్లు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని వివిధ గ్రంథాలయాల్లో పనిచేస్తున్న పార్ట్ టైం స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం హైదరాబాద్‌లో గ్రంథాలయ డైరెక్టర్ శ్రీహరికి జిల్లా సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. పార్ట్‌టైం స్వీపర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్ మాట్లాడుతూ వేతనాల్లో తారతమ్యాలు లేకుండా అన్ని జిల్లాల్లో ఒకేవిధంగా చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.20వేలు అందించాలని, అర్హత, సర్వీసుకు అనుగుణంగా కేటగిరీ పోస్టుల్లోకి తీసుకోవాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మధు, సభ్యులు సలీం, స్వామి తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక అధ్యాపకులకు దరఖాస్తులు

మంచిర్యాలఅర్బన్: కాళేశ్వరం జోన్ సాంఘిక సంక్షేమ గురుకులాల్లో తాత్కాలిక పద్ధతిన అధ్యాపకులు, ఉపాధ్యాయుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జోనల్ అధికారి అరుణకుమారి తెలిపారు. ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలోని 25 తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాలు, జూనియర్ కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో బోధించేందుకు అధ్యాపకులు, ఉపాధ్యాయులను నియమించనున్నట్లు పేర్కొన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, జూనియర్ లెక్చరర్, హెల్త్‌సూపర్‌వైజర్, పీఈటీ, పీడీల ఎంపికకు ఈనెల 29 తేదీన, కోర్ సబ్జెక్టులైన గణితం, సైన్స్, సోషల్, లైబ్రేరియన్ సబ్జెక్టులకు ఈ నెల 30న పాఠ్యాంశ బోధన డెమోలు ఉంటాయని వివరించారు. జూనియర్ లెక్చరర్, పీజీటీ పోస్టులకు యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి కనీసం 50 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో పీజీ డిగ్రీతోపాటు బీఈడీ అర్హత, టీజీటీ పోస్టులకు యూజీసీ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం బీఎస్సీ, బీఏ, బీకాం డిగ్రీ కనీసం 50 శాతం మార్కులతో బీఈడీ అర్హత ఉండాలని తెలిపారు. పీఈటీ, పీడీ పోస్టులకు యూజీడీ, పీఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ అర్హత కలిగి ఉండి 50 శాతం మార్కులు తగ్గకుండా ఉండాలని పేర్కొన్నారు. హెల్త్ సూపర్ వైజర్ పోస్టులకు జనరల్ నర్సింగ్, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ డిగ్రీ ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కలిగి ఉండాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జోనల్ అధికారి టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐ సొసైటీ మంచిర్యాలలో సంప్రదించాలని వెల్లడించారు.

ధర్నా జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: ఉపాధి పథకంలో పనిచేస్తున్న వారికి రూ.600 కూలి ఇవ్వాలని, ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని ఈ నెల 30న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని వంజీరి, భట్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం ఉపాధిహామీ కార్మికులతో కలిసి ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర చేస్తోందని ఆరోపించారు. కూలీల సంఖ్య పెరుగుతున్నా బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తున్నారని తెలిపారు.

నది దాటించి.. వాహనాల్లో కుక్కి



కౌటాలలో డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్న పశువులు(ఫైల్)

- యథేచ్ఛగా పశువుల అక్రమ రవాణా
- మహారాష్ట్ర నుంచి జిల్లాకు..
- రాత్రిపూట నగరాలకు తరలింపు
- ఇరుకు వాహనాల్లో మూగజీవాల వేదన

నది ఒడ్డున.. దందా



కౌటాల మండలం తాటిపల్లి సమీపంలో వార్ధా నది సరిహద్దున మహారాష్ట్ర ప్రాంతం ఉంది. మహారాష్ట్రలోని దళారులు తాటిపల్లి వార్ధా నది మార్గంలో కౌటాల పశువుల వారసంతకు పశువులను తరలిస్తున్నారు. చంద్రపూర్, ఛత్తీస్‌గఢ్, గడ్చిరోలి జిల్లాలతోపాటు సిందేవాయి, వాడ్సా, బ్రమపూరి ప్రాంతాల నుంచి వందల పశువులను నదిలో నుంచి ప్రమాదకరంగా తాటిపల్లి ఒడ్డుకు చేరుస్తున్నారు. అక్కడి నుంచి ఓ ముఠా వాహనాల్లో తరలిస్తుండగా.. కొందరు ఎద్దులను జతలు కట్టి కౌటాలకు రోడ్డు మార్గంలో తీసుకెళ్తున్నారు. ఒక రాష్ట్రానికి చెందిన పశువులను మరో రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఈ వ్యవహారమంతా అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

కౌటాల(సిర్పూర్): జిల్లాలో పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. సరిహద్దు నుంచి నది దాటించి గుట్టుగా వేలాది ఎద్దులు, ఆవులను పట్టణాల్లోని కబేళాలకు తరలిస్తున్నారు. మూగజీవాల రోదనను ఆలకించేవారు కరువయ్యారు. సంతల నుంచి డీసీఎంలు, కంటైనర్లు, బొలేరో వాహనాల్లో కుక్కి నగరాల్లోని వ్యాపారులకు అమ్ముతున్నారు. వాహనాల్లో సరిపడా స్థలం లేక పశువుల కాళ్లు, శరీర భాగాలు విడిపోయి అల్లాడిపోతున్నాయి. మేత, నీరు లేకపోవడం ఊపిరాడక మార్గమధ్యలోనే ప్రాణాలు విడుస్తున్నాయి. మృతి చెందిన పశువులను అటవీ ప్రాంతాలు, రోడ్డు పక్కన పడేసి వెళ్తుండటంతో కళేబరాల దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

సంతల నుంచే..

జిల్లాలో ఎద్దులు, ఆవులు కలిపి 2,93,895 వరకు ఉండగా, గేదెలు 49,445 ఉన్నాయి. ఇందులో ఏటా పదిశాతం వరకు వట్టిపోతాయి. మరికొన్ని అనారోగ్యం పాలవుతాయి. వీటిని కొందరు వ్యాపారులు రాజకీయ అండతో అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. కౌటాల, జైనూర్, వాంకిడి ప్రాంతాల్లో వారానికి ఒకసారి జరిగే సంతల ముసుగులోనే కొందరు వ్యవహారం నడిపిస్తున్నారు. పశువుల అక్రమ రవాణాకు ముఠాగా ఏర్పడి వారసంతలో పశువులను తక్కువ రేటుకు కొని వాహనాల్లో ఎక్కించి హైదరాబాద్, కరీంనగర్‌కు తరలిస్తున్నారు. అలాగే సరిహద్దులోని మహారాష్ట్ర నుంచి పశువులను సంతకు తీసుకువచ్చి ఒక్కో వాహనంలో పదుల సంఖ్య వరకు అడ్డదిడ్డంగా ఎక్కిస్తున్నారు. పశువుల రవాణా కోసం అనుమతులు ఇవ్వాలని ఇటీవల కౌటాల పశువైద్యాధికారి అనుమతి కోసం భారీగా ప్రజలు రావడంతో పోలీసులతో వారిని నిలువరించాల్సిన పరిస్థితి నెలకొంది. జూన్‌లో నిర్వహించే పండుగల కోసం ఇప్పటినుంచే పశువులను తరలిస్తున్నారు. 1960 జంతు పరిరక్షణ చట్టం ప్రకారం పశువులను వధించడం నేరం. వట్టిపోయిన పశువులను రైతుల నుంచి రూ.5 వేల నుంచి రూ.10 వేలకు దళారులు కొంటున్నారు. వారు మాత్రం రూ.15 వేల నుంచి రూ.20 వేలకు అమ్ముకుంటున్నారు. మాంసంతోపాటు చర్మం, కొమ్ములు, ఎముకలు ఇతర భాగాలు చెప్పులు, వాయిద్య పరికరాలు, ఎరువుల తయారీలో వినియోగిస్తారు. భారీగా విక్రయాలు జరుగుతున్నా మార్కెటింగ్ శాఖ, రవాణా చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రాత్రుల్లో ఇష్టారీతిన..

వాంకిడి, కౌటాల, జైనూర్ మండలాల్లోని పశువుల సంతల్లో దళారులు పశువులను కొనుగోలు చేసి రాత్రి వేళల్లో గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. సిర్పూర్(టి) నుంచి కాగజ్‌నగర్ వరకు, రెబ్బెన నుంచి మంచిర్యాల జిల్లా దాటే వరకు ప్రత్యేకంగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని దందా సాగిస్తున్నారు. కొంతమంది రాత్రి వేళల్లో రహదారులపై తిరిగే పశువులు, ఒంటరిగా ఉండేవాటిని, రైతులు ఇంటి సమీపంలో కట్టి ఉంచిన వాటిని లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే పోలీస్ స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయి. ఈ దందాలో వాటాలు అందరికీ అందుతుండటంతో చీకటి వ్యాపారం గప్‌చుప్‌గా సాగుతోంది. పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు

పశువుల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్‌శాఖ చర్యలు చేపట్టింది. ఆరు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. సిర్పూర్(టి) మండలం పెద్దబండ వద్ద, చింతలమానెపల్లి మండలం ఆడేపల్లి ఎక్స్‌రోడ్డు, బెజ్జూర్ మండలం సలుగుపల్లి ఎక్స్‌రోడ్డు, కాగజ్‌నగర్ మండలం వంజరీ వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అలాగే జైనూర్ మండలం రాణి రుద్రమదేవి చౌక్, వాంకిడి టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టులు ఉన్నాయి. పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు.

ఇటీవల ఘటనలు

- ఏప్రిల్ 17న వాంకిడి మండలం అకిని సమీపంలో నాలుగు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు. ఎనిమిది పశువులను స్వాధీనం చేసుకుని, 8 మందిపై కేసు నమోదు చేశారు.
- ఈ నెల 3న కాగజ్‌నగర్ బస్టాండ్ సమీపంలో అక్రమంగా పశువులను తరలిస్తున్న నాలుగు వాహనాలను పోలీసులు పట్టుకున్నారు.
- ఈ నెల 6న కాగజ్‌నగర్‌లోని డాడానగర్ సమీపంలో ఐచర్ వాహనంలో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 21 పశువులను పోలీసులు పట్టుకున్నారు.
- సిర్పూర్(టి) నుంచి హైదరాబాద్‌కు ఎద్దులను అక్రమంగా తరలిస్తున్న 13 బొలేరో వాహనాలను కాగజ్‌నగర్‌లో గత నెలలో పోలీసులు పట్టుకున్నారు. 26 పశువులను స్వాధీనం చేసుకుని 13 మందిపై కేసు నమోదు చేశారు.

నది మీదుగా తరలింపు



తాటిపల్లి సమీపంలోని వార్ధా నది మీదుగా మహారాష్ట్ర నుంచి వందల పశువులను కౌటాలకు తరలిస్తున్నారు. శుక్ర, శని, ఆది, సోమవారాలు నాలుగు రోజులపాటు నది వద్ద పశువుల అక్రమ రవాణా సాగుతోంది. నదిలో నీరు ప్రవహిస్తున్నా ప్రమాదకరంగా మూగజీవాలను తరలిస్తున్నారు. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

– దత్తు, తాటిపల్లి, మం.కౌటాల

ధాన్యం తరలింపులో జాప్యం చేయొద్దు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ డేవిడ్

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వరి ధాన్యం తరలింపులో జాప్యం చేయొద్దని అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్ అన్నారు. రెబ్బెన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం తరలింపులో ఏమైనా జాప్యం జరుగుతుందా.. కొనుగోళ్ల ప్రక్రియ సక్రమంగా సాగుతుందా.. తదితర వివరాలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ 17శాతం కంటే తక్కువ తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. రోజుల తరబడి కేంద్రాల్లో నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలన్నారు. అకాల వర్షాలతో కేంద్రాల్లో వడ్లు తడిసిపోతే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, కొనుగోళ్ల ప్రక్రియ, ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని సూచించారు. లారీలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఆర్‌ఐలు ఉదయ్‌కుమార్, సౌమ్య, ఏవో దిలీప్‌కుమార్, ఏఈవో రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కెరమెరి(ఆసిఫాబాద్): మారుమూల గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మండలంలోని పలు గ్రామాలను శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ తుమ్మగూడ గ్రామ పంచాయతీలోని కటాఫ్ గ్రామాలకు చేరుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గోర్యాగూడ గ్రామంలో పరిస్థితులపై సమీక్షించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి వెంకట్, ఎంపీడీవో అంజద్ పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్ తదితరులు ఉన్నారు.

'మావో'ళ్లు ఎట్లున్నరో..!



ఉమ్మడి జిల్లాకు చెందిన మావోయిస్టులు(ఫైల్)

- ఉద్యమంలో ఉమ్మడి జిల్లా వాసులు
- దశాబ్దాలుగా అడవుల్లోనే..
- వైభవం నుంచి ఉనికి కోల్పోతున్న దశకు..
- 'ఆపరేషన్ కగార్' నేపథ్యంలో సర్వత్రా చర్చ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఒకప్పుడు వామపక్షవాద ఉద్యమానికి బలమైన కేంద్రంగా ఉండేది. ప్రతీ గ్రామం నక్సలైట్లకు ఆశ్రయంగా మారిన రోజులు గతంలో ఉండేవి. అయితే, ఇప్పుడు ఈ జిల్లా మావోయిస్టు ప్రభావ రహిత ప్రాంతంగా మారింది. కేంద్ర ప్రభుత్వం 2026 నాటికి మావోయిస్టు పార్టీని అంతం చేసేందుకు 'ఆపరేషన్ కగార్' చేపట్టింది. ఈ నేపథ్యంలో పార్టీ అగ్రనేతలు ఒక్కొక్కరుగా నేలకొరుగుతున్నారు. ఈ పరిస్థితిలో ఉమ్మడి జిల్లాకు చెందిన కొందరు కీలక నాయకులు ఇంకా సిద్ధాంతంతో పోరుబాటలోనే నడుస్తున్నారు. వారి ఆచూకీపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉనికి కోల్పోతున్న ఉద్యమం

ఉమ్మడి జిల్లాలో దశాబ్దాలపాటు మావోయిస్టు ఉద్యమం బలంగా సాగింది. ప్రస్తుతం దాని ఉనికి దాదాపు క్షీణించింది. వందలాది మంది కార్యకర్తలు ఎన్‌కౌంటర్లలో మరణించడం లేదా లొంగిపోవడం జరిగింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కటకం సుదర్శన్(ఆనంద్, 69) 2024 జూన్‌లో మరణించారు. సీనియర్ నాయకులైన ఒగ్గు సత్వాజీ, కాసర్ల రవి (అశోక్), కంతి లింగవ్వ, గడ్డం మధూకర్, సుమన్, రవిబాబు వంటి వారిని పార్టీ కోల్పోయింది. మూల దేవేందర్‌రెడ్డి అరెస్టయ్యారు. 2020లో కాగజ్‌నగర్ మండలం కడంబా అడవులో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చుక్క మరణించారు.

మావోయిస్టు రహిత జిల్లాగా..

కేంద్ర హోంశాఖ ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల జాబితా నుంచి తొలగించింది. ప్రస్తుతం తెలంగాణలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాత్రమే ఈ జాబితాలో కొనసాగుతోంది. గతంలో నిర్మల్ నుంచి బెజ్జూరు వరకు, బొగ్గు గనులు, అడవులు, గిరిజన ప్రాంతాల్లో మావోయిస్టు కార్యకలాపాలు సాగేవి. పీపుల్స్ వార్ గ్రూప్ ద్వారా సింగరేణిలో సికాస (సింగరేణి కార్మిక సమాఖ్య) బలంగా పనిచేసిన రోజుల్లో ఎన్‌కౌంటర్లు తరచూ జరిగేవి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సానుభూతిపరుల బలంతో ఉద్యమం విస్తరించింది. కొత్త నియామకాలతో విద్యావంతులు అజ్ఞాతంలోకి వెళ్లారు. అయితే, గత రెండు దశాబ్దాలలో పరిస్థితులు మారాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత పార్టీ ఉనికి దాదాపు క్షీణించింది. ఇప్పుడు అప్పుడప్పుడు పత్రికా ప్రకటనలు మినహా ఎలాంటి కార్యకలాపాలు కనిపించడం లేదు.

కుటుంబాల్లో ఆందోళన..

దండకారణ్యం, అబూజ్‌మడ్ వంటి ప్రాంతాల్లో ఎన్‌కౌంటర్లు కొనసాగుతున్న నేపథ్యంలో, ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన నాయకుల ఆచూకీపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పటి బలమైన ఉద్యమం ఇప్పుడు దాదాపు అంతరించిన స్థితిలో ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి కార్యాచరణ, ఆపరేషన్ కగార్ వంటి చర్యలతో మావోయిస్టు ఉద్యమం మరింత బలహీనపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో, జిల్లాలో గతంలో ఉన్న సానుభూతి, కార్యకలాపాలు గణనీయంగా తగ్గడం, భవిష్యత్తులో ఈ ఉద్యమం పూర్తిగా కనుమరుగయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

ఇప్పటికీ కీలక స్థానాల్లో కొందరు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొందరు నాయకులు ఇప్పటికీ మావోయిస్టు పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

ఇర్రి మోహన్ రెడ్డి: సెంట్రల్ బ్యూరో, కేంద్ర సాంకేతిక కమిటీ సభ్యుడు.

బండి ప్రకాశ్: సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ సెక్రెటరీ, ఇటీవల కేంద్ర కమిటీలో చేరారు.

మైలారపు అడెల్లు: స్టేట్ కమిటీ సభ్యుడు, కుమురం భీం, మంచిర్యాల కమిటీ ఇన్‌చార్జి.

సలాకుల సరోజ: సీనియర్ నాయకురాలు, పార్టీ ప్రింటింగ్ ప్రెస్ బాధ్యతలు.

జాడి వెంకటి, పుష్పలత: సీనియర్ నాయకులు, దండకారణ్యంలో బాధ్యతలు.

చౌదరి అంకుబాయి, లచ్చన్న, తూము శ్రీనివాస్: సీనియర్ కేడర్‌గా కొనసాగుతున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



వివరాలు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

కాగజ్‌నగర్‌టౌన్: రైతులకు ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్ వివరాలు, రసీదు పుస్తకాలు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ దుకాణాల్లో ఎరువులు, విత్తనాల ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ప్రతిరోజూ దుకాణాలను వ్యవసాయాధికారులు తనిఖీ చేసి, నివేదికలు అందించాలని సూచించారు.

ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలి

ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి సంరక్షించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం భారత ప్రభుత్వ గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మాకే నామ్, ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కలెక్టర్ మాట్లాడుతూ తల్లుల పేరిట ప్రతీ ఇంటి ఆవరణలో మొక్కలు నాటి, మాతృమూర్తులను గౌరవించుకుందామన్నారు. పట్టణాల్లో గుర్తించిన చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, ఖాళీ స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు.

అర్హులను ఎంపిక చేయాలి

రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులను ఎంపిక చేసి, జిల్లాస్థాయి కమిటీకి పంపించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. పట్టణ మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 2 నాటికి అర్హులకు మంజూరు పత్రాలు అందజేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస్, తహసీల్దార్ కిరణ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, ఏడీఏ మనోహర్, ఏవో రామకృష్ణ, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ మోతీరాం, అమృత మిత్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులకు అన్యాయం చేస్తున్న గుర్తింపు సంఘం'




సమస్యలు తెలుసుకుంటున్న రాజాబాబు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో కార్మికులపై అధిక పనిభారం మోపుతున్నా.. కనీసం స్పందించకుండా గుర్తింపు సంఘం కార్మికులకు అన్యాయం చేస్తోందని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. ఖైరిగూడ ఓసీపీలో శుక్రవారం హెచ్‌ఎంఎస్ నాయకులు పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మేనేజర్ శంకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ఏరియాలో ఐఈడీ ప్రకారం కార్మికుల సంఖ్య తక్కువగా ఉందని, విరమణ పొందిన వారి స్థానంలో కొత్తవారిని నియమించడం లేదన్నారు. ఇచ్చిన హామీలు మర్చిపోయి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందని ఆరోపించారు. ఈపీ ఆపరేటర్లు ఏ గ్రేడ్ వాహనాలు నడుపుతున్నందున ఖాళీలతో సంబంధం లేకుండా ఏ గ్రేడ్ పదోన్నతులు కల్పించాలన్నారు. ఓసీపీలో టెక్నీషియన్ల కొరతను నివారించాలని, బదిలీపై వచ్చిన సర్ఫేస్ జనరల్ అసిస్టెంట్‌లకు ఆర్థికనష్టం జరగకుండా బేసిక్, కేటగిరీ ప్రొటెక్షన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఆర్గనైజర్ ఎస్కే ఇనూష్, ఫిట్ కార్యదర్శి రామకృష్ణ, ఎస్‌అండ్‌పీసీ ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్ అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి కిష్టస్వామి, ఆర్గనైజర్ బొట్ల కిష్టస్వామి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు
- కౌటాల– కాగజ్‌నగర్ రహదారిపై రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, రైతులు

కౌటాల(సిర్పూర్): అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ కౌటాల– కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ముత్తంపేట వద్ద తడిసిన ధాన్యాన్ని పోసి శుక్రవారం రైతులు చేపట్టిన రాస్తారోకోకు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తడిసిన ధాన్యాన్ని కొంటామని చెబుతున్నారని, ఇక్కడమో తప్ప, తాలు, తేమ పేరిట తీవ్ర జాప్యం చేస్తున్నారన్నారు. పంట చేతికొచ్చి నెల రోజులవుతుందని, ధాన్యం సేకరించాలని జిల్లా అధికారులకు సూచించినా పట్టించుకోకపోవడంతోనే అన్నదాతలకు ఈ పరిస్థితి వచ్చిందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ డేవిడ్ రాస్తారోకో చేస్తున్న రైతుల ధాన్యాన్ని పరిశీలించారు. 20 రోజులుగా పడిగాపులు కాస్తున్నామని, కొనుగోలు చేయడం లేదని రైతులు వాపోయారు. రైస్ మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై రైతులను ముంచుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే హరీశ్‌బాబు సివిల్ సప్లై కమిషనర్ చౌహాన్‌తో సెల్‌ఫోన్‌లో మాట్లాడి తడిసిన ధాన్యం కొనాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో కొనుగోలు చేస్తామని అదనపు కలెక్టర్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. నాలుగు గంటలపాటు వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేందర్‌గౌడ్, నాయకులు మల్లయ్య, మోతీరాం, తిరుపతి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన రైతులు



సిర్పూర్(టి)- కౌటాల ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

సిర్పూర్(టి)/చింతలమానెపల్లి: ధాన్యం కొనుగోలు చేయాలని శుక్రవారం రైతులు రోడ్కెక్కారు. సిర్పూర్(టి) మండలంలోని పారిగాం గ్రామస్తులు సిర్పూర్(టి)– కౌటాల ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్‌లో వరిధాన్యం బస్తాలను రోడ్డుపై వేసి రైతులు ఆందోళన నిర్వహించారు. ఆరు రోజులుగా రవీంద్రనగర్ కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని తెలిపారు. కాంటా చేయకపోవడంతో నిల్వ ఉంచిన వడ్లు వర్షానికి తడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

షరతులు లేకుండా ధాన్యం కొనాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో ఇటీవల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం ఏవో మధుకర్‌కు వినతిపత్రం అందించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దినకర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఇప్పటివరకు 3,700 టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. ధాన్యం కాంటా పూర్తయినా ఆరురోజులుగా తరలించడం లేదన్నారు. కొన్ని మండలాల్లో మిల్లర్లు అన్‌లోడింగ్‌కు ఒప్పుకోకపోవడంతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజేందర్, కార్తీక్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐఎన్టీయూసీలో పలువురికి పదవులు


జీవన్ జోయల్

శ్రీరాంపూర్: సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టీయూసీ)లో శ్రీరాంపూర్‌కు చెందిన పలువురు నాయకులకు కీలక పదవులు దక్కాయి. యూనియన్ సెక్రెటరీ జనరల్ బి.జనక్‌ప్రసాద్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీరాంపూర్ ఓసీపీలో ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న జీవన్ జోయల్‌ను ప్రధాన కార్యదర్శిగా, జీఎం కార్యాలయంలో స్పోర్ట్స్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న చాట్ల అశోక్‌ను కేంద్ర కార్యదర్శిగా నియమించారు. యూనియన్ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయిలో ఎనిమిదో ర్యాంకు


జి.హరిప్రియ

కుంటాల: ఇంటర్‌లో ప్రవేశం కోసం ఈనెల 10న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన టీజీఆర్‌టీసీ సెట్ పరీక్షల ఫలితాలు శుక్రవారం వెలువడ్డాయి. ఇందులో నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని కల్లూర్ వాసవి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి జి.హరిప్రియ ఎనిమిదో ర్యాంకు సాధించింది. విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాళ్లు సాయిలు, గట్టుపల్లి శ్రీనివాస్, డైరెక్టర్లు హరిప్రసాద్, జానకీరామ్ అభినందించారు.

కాల్వ ఆలయ హుండీ లెక్కింపు


హుండీని లెక్కిస్తున్న భక్తులు

దిలావర్‌పూర్: మండలంలోని అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం గల కాల్వ అటవీ ప్రాంతంలో వెలిసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. ఇటీవల జరిగిన ఆలయ బ్రహ్మోత్సవాలు ముగియడంతో ఈ హుండీని లెక్కించారు. హుండీ ద్వారా రూ.3,77,446 ఆదాయం సమకూరినట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. కల్యాణం సందర్భంగా తాళిబొట్ల రూపంలో మిశ్రమ బంగారం సైతం సమకూరినట్లు వెల్ల డించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంగూరి మహేందర్, దేవాదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్‌లు మనోహర్, మాధవరావు, పాలక మండలి సభ్యులు గట్టు కాశీనాథ్, రాసరి శ్రీకాంత్, గుమ్ముల నర్సయ్య, సూర నవీన్, పూదరి శివకుమార్, దేవేందర్, లక్ష్మణ్, విఠల్, మహేందర్, నర్సారెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జీపీలకు నిలిచిన నిధులు

- ఆర్థిక సంఘం నిధులు రాక పాలన అస్తవ్యస్తం
- గ్రామాల్లో కుంటుపడిన అభివృద్ధి

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	పంచాయతీలు	మండలాలు
ఆదిలాబాద్	473	21
మంచిర్యాల	306	16
నిర్మల్	396	19
కుమురంభీం	334	15


హాజీపూర్ మండలంలోని గఢ్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం

మంచిర్యాలరూరల్(హాజీపూర్)/కుంటాల: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. దీంతో పాలకవర్గాలు లేక స్థానిక సంస్థలకు నిధులు నిలిచిపోయాయి. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల పాలకవర్గాల పదవీ కాల పరిమితి ముగియడంతో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను నిలిపివేసింది. రాష్ట్రం ప్రభుత్వం కూడా స్థానిక సంస్థలకు నిధులు ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో 15 నెలలుగా పల్లెల్లో పాలన అస్తవ్యస్తంగా మారింది. జిల్లా, మండల పరిషత్ కార్యాలయాల నిర్వహణ కష్టతరంగా మారింది. చేసేది లేక గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు అప్పులు చేసి మరీ అత్యవసర పనులు చేయిస్తున్నారు.

ప్రత్యేక అధికారుల పాలనలోనే..

2024 ఫిబ్రవరితో గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల పదవీ కాలం పూర్తయ్యింది. వెంటనే ఎన్నికల నిర్వహణ చేపట్టాల్సి ఉండగా కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన పెట్టింది. ఏడాదిన్నర కావస్తున్నా పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఎలాంటి అడుగులు పడటం లేదు. ఇక మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల కాల పరిమితి కూడా 2024 జులై 5వ తేదీతో ముగిసిపోయింది. దీంతో పరిషత్ ఉన్నికల నిర్వహణ లేకపోవడంతో ఇక్కడ కూడా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది.

నిలిచిన ఆర్థిక సంఘం నిధులు..

స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఆయా గ్రామాల జనాభాను బట్టి ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తుంది. కేంద్రం ఇచ్చే నిధులతో పాటు రాష్ట్ర గ్రాంట్ కూడా అందులో కలిపి ఇవ్వాలనే నిబంధన ఉంది. అయితే పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధుల విడుదల నిలిపివేసింది.

ఆర్థిక సంఘం నిధుల ఖర్చు ఇలా..

కేంద్రం నుంచి జిల్లాకు వచ్చే మొత్తం నిధుల్లో 5 శాతం జిల్లా పరిషత్‌కు, 10 శాతం మండల పరిషత్‌కు, 85 శాతం గ్రామ పంచాయతీలకు కేటాయిస్తారు. దీంతో ఆయా పాలకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు వారి పరిధిలో అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉండేది. ఆ వచ్చిన నిధుల్లోనే 6 శాతం కార్యాలయాల నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ 6 శాతం నిధులను విద్యుత్, నెట్ బిల్లులు, వాహనాల అద్దె చెల్లింపు, ఇతర ఖర్చులకు వినియోగించేవారు. కేంద్రం నిధులు నిలిపివేయడంతో ఇప్పుడు ఈ చెల్లింపులన్నీ నిలిచిపోయాయి.

అప్పుల్లో కార్యదర్శులు..

గ్రామాల్లో అభివృద్ధి మాట దేవుడెరుగు..రాబోయే వర్షాకాలంలో కనీసం బ్లీచింగ్ పౌడర్ కొనడానికి కూడా డబ్బులు లేవు. ప్రతీనెల విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలు, పారిశుధ్య కార్మికులకు వేతనాలు, వీధి దీపాల నిర్వహణ, తదితర పనులకోసం అప్పులు చేయాల్సి వచ్చిందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు వస్తాయనే ఆశతో కార్యదర్శులు అప్పులు తీసుకువచ్చి మరీ పనులు చేయిస్తున్నారు. సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో ఇటు బిల్లులు రాక అటు వడ్డీలు పెరిగి అప్పుల పాలవుతున్నారు. మండల పరిషత్‌లకు సంబంధించి రెండేళ్ల నుంచి ఎంపీడీవోల వాహనాలకు అద్దె చెల్లింపులు, ఇంటర్‌నెట్ బిల్లులు, కరంట్ బిల్లుల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా పరిషత్‌లలో నిల్వ ఉన్న ఫండ్‌తో కార్యాలయ నిర్వహణ కొనసాగిస్తుండగా రానున్న రోజుల్లో ఫండ్ అయిపోతే కార్యాలయ నిర్వహణ ప్రశ్నార్థకం కానుంది. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి ఆర్థిక సంఘ నిధులు రెగ్యులర్‌గా విడుదల చేయించి గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని కోరుతున్నారు.

నిర్వహణ భారంగా మారింది



పంచాయతీల అభివృద్ధికి మావంతు కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగానే పల్లె ప్రగతి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయక నిర్వహణ భారంగా మారింది.

– తిరుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, కోలూరు, కుంటాల

ప్రతిపాదనలు పంపించాం



పంచాయతీలకు నిధులు విడుదల కాని మాట వాస్తవమే. నిధులు విడుదల చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. రెండు, మూడు రోజుల్లో పంచాయతీ ఖాతాల్లో నిధులు జమ చేసే అవకాశాలు ఉన్నాయి. పంచాయతీల అభివృద్ధికి అందరం సమన్వయంతో పని చేయాలి.

– పీ.శ్రీనివాస్, డీపీవో, నిర్మల్

పులిని హతమార్చిన ఘటనలో 30 మంది రిమాండ్


రిమాండ్ చూపిస్తున్న అధికారులు

పెంచికల్‌పేట్/దహెగాం: పెంచికల్‌పేట్ మండలం ఎల్లూర్ అటవీ ప్రాంతంలో ఈ నెల 15న వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చి పెద్దపులిని హతమార్చిన ఘటన రాష్ట్రంలో సంచలనంగా మారిన విషయం విధితమే. ఈ ఘటనపై అటవీ శాఖ ప్రత్యేక బృందాలు వారం రోజులుగా నిందితులను గుర్తించేందుకు విచారణ చేపట్టాయి. ఈ ఘటనలో పెంచికల్‌పేట్, దహెగాం మండలాలకు చెందిన 30 మంది పాల్గొన్నట్లు నిర్ధారించారు. శుక్రవారం సిర్పూర్(టి) కోర్టులో దహెగాం, పెంచికల్‌పేట్ మండలాలకు చెందిన 30 మందిని హాజరుపర్చగా.. నిందితులకు 14 రోజులు రిమాండ్ విధించినట్లు డీఎఫ్‌వో నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వృద్ధురాలు మృతి


వివరాలు సేకరిస్తున్న రూరల్ ఎస్సై లింబాద్రి

నిర్మల్‌రూరల్: మండలంలోని ముజిగి గ్రామంలో శుక్రవారం విద్యుత్ షాక్‌తో వృద్ధురాలు మృతి చెందినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దగొండ గంగవ్వ (72) తన ఇంటి బయట మెట్ల సమీపంలో ఉన్న ఇనుపరాడును పట్టుకోవడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రూరల్ ఎస్సై లింబాద్రి సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. స్తంభం నుంచి ఇంటికి వచ్చే వైర్‌కు విద్యుత్ సరఫరా ఉండడంతో భారీ వర్షాలకు ఎర్తింగ్ ద్వారా బయట ఉన్న మెట్ల ఇనుప చువ్వలకు కూడా కరెంటు సరఫరా అయినట్లు ఎస్సై ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో మూగజీవాలు..


కుంసరలో మృతి చెందిన ఎద్దు


గొల్లమాడలో మృతి చెందిన మేక

భైంసారూరల్: మండలంలోని కుంసరలో శుక్రవారం విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన భూమన్న ఎద్దు గ్రామ శివారులోని పంట చేనులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. ఎద్దు విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు భూమన్న వేడుకుంటున్నాడు.

గొల్లమాడలో మేక..

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడలో విద్యుత్‌షాక్‌తో మేక మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మస్కిరి లక్ష్మణ్ గ్రామ శివారులో మేకలు మేపుతుండగా తక్కువ ఎత్తులో, కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పశు వైద్యాధికారి ముక్తార్ అహ్మద్ పంచనామా నిర్వహించారు. ప్రభుత్వం పరిహారం అందించాలని బాధితుడు కోరుతున్నాడు.

బోథ్: మండలంలోని కౌట(బీ)లో పడిగెల చిన్న భీముడుకు చెందిన గేదె విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. రెండు రోజులుగా గాలులతో కూడిన వర్షాల కారణంగా గ్రామ సమీపంలోని పంట పొలాల మీదుగా వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్‌కు చెందిన తీగలు తెగి కింద పడిపోయాయి. మేతకు వెళ్లిన గేదె వైర్లను తాకడంతో మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని, ప్రభుత్వమే తమను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

పాము కాటుతో గేదె..


గేదెను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి

సోన్: మండలంలోని న్యూ వెల్మల్‌లో కడ్తాల చిన్నయ్యకు చెందిన గేదె శుక్రవారం పాము కాటుతో మృతి చెందింది. రోజులాగే మేతకు వెళ్లిన గేదెను మధ్యాహ్నం పాము కాటు వేయడంతో మృతి చెందినట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. గేదె విలువ రూ.50 వేల వరకు ఉంటుందని వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఇద్దరిపై గంజాయి కేసు


గంజాయి, నిందితులతో పోలీస్ సిబ్బంది

భీంపూర్: మండలంలోని తాంసి(కే) గ్రామంలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారంతో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశానుసారం ఎస్సై పీర్ సింగ్, సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన మంచికంటి అశోక్, ఓంకార్ల వ్యవసాయ భూమిలో సాగు చేస్తున్న 30 గంజాయి మొక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

ఆరుగురి బైండోవర్


బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఖానాపూర్: మండలంలో పలుచోట్ల ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఆరుగురిని శుక్రవారం తహసీల్దార్ సుజాత ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్ తెలిపారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బైండోవర్ ఉల్లఘించిన వారికి రూ.2లక్షల జరిమానా లేదా రెండేళ్ల జైలుశిక్ష విధిస్తారని తహసీల్దార్ తెలిపారు. సిబ్బంది వెంకటేష్, ఇర్ఫాన్, సాయన్న, కల్పన పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

ఇంద్రవెల్లి: బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఉట్నూర్ సీఐ మొగిలి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏజెన్సీ ప్రాంతమైన ఇంద్రవెల్లి మండల కేంద్రంలో చంపత్‌రావు నిర్మించిన వాణిజ్య నిర్మాణంపై మెస్రం ఆనందరావు, గవండే బిపిన్‌కుమార్ 2023లో ఐటీడీఏ కోర్టులో ఫిర్యాదు చేశారన్నారు. ఇరువురు చంపత్‌రావును కలిసి ఫిర్యాదును వెనక్కి తీసుకునేందుకు రూ.2లక్షలు వసూలు చేశారని, ఇంద్రవెల్లి పబ్లిక్ స్కూల్ యజమాని వద్ద అదే సంవత్సరంలో రూ.2లక్షలు వసూలు చేసినట్లు తమ దర్యాప్తులో తేలిందని సీఐ తెలిపారు. ఈ ఇరువురు నిందితులు ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనేతరులందరినీ కలిసి తమకు రూ.20 లక్షల ఇవ్వాలని, లేనిపక్షంలో ఐటీడీఏ కోర్టులో కేసులు నమోదు చేయిస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మెస్రం ఆనంద్‌రావుతో పాటు ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని మరికొంత మంది గిరిజనేతరులకు నోటీసులు పంపడం జరిగిందని తమ విచారణలో బహిర్గతమైందన్నారు. ఇరువురిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బాసరకు పోటెత్తిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


క్యూలో వేచి ఉన్న భక్తులు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. విశ్వావసు నామ సంవత్సరం ఏకాదశి శుభ ముహూర్తం ఉండడంతో భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువ జామున శ్రీ మహాలక్ష్మి, సరస్వతి, మహాకాళి అమ్మవార్లకు అభిషేకం, అర్చన, హారతి పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి వచ్చారు. ముందుగా భక్తులు గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరారు. తమ చిన్నారులకు అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు జరిపించారు. అక్షరాభ్యాసం, ఇతర సేవల ద్వారా రూ. 8 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గోదావరి తీరం.. ప్రమాదకరం


పుష్కరఘాట్ వద్ద పాకురుతో నిండిపోయిన దృశ్యం


కాలువలో పెరిగిన గుర్రపు డెక్క మొక్కలు

- నీటి మళ్లింపు గుంతల్లో పెరిగిన గుర్రపు డెక్క
- మట్టి తరలింపుతో ప్రమాదకర గుంతలు
- పుష్కరఘాట్‌లపై పాకురు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని గోదావరి నదీతీరం, పుణ్యస్నానాలకు వచ్చే ప్రజలకు ప్రమాదకరంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి శివరాత్రి, బంధువుల మరణానంతరం స్నానాల కోసం వచ్చే వారికి ఈ తీరం ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతం గుంతలు, లోతైన కాలువలతో ప్రమాద స్థితిలో ఉంది. శివరాత్రి సమయంలో నది ఆవలివైపు నీటిని మంచిర్యాల వైపు ప్రవహించేందుకు తవ్విన కాలువలో గుర్రపు డెక్కలు మొలిచాయి. తవ్విన ఇసుకను ఇరువైపులా పోయడంతో నదిలో లోతును అంచనా వేయడం కష్టమైంది. ఇసుక, మట్టి తవ్వకాల వల్ల ఏర్పడిన పెద్ద గుంతలు, వర్షాల సమయంలో వరద నీటితో నిండి, స్నానం చేసేవారికి ప్రాణాంతకంగా మారే అవకాశం ఉంది.

పుష్కరఘాట్‌లపై అశ్రద్ధ

గోదావరి పుష్కరాల సమయంలో నిర్మించిన ఘాట్‌లు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ఘాట్‌ల వద్ద నల్లాల నుంచి నిరంతరం పారే నీటితో పాకురు పెరుగుతోంది. దీంతో జారిపడే ప్రమాదం పొంచి ఉంది. నదిలో నీరు లేకపోవడంతో, ఆవలి వైపు వెళ్లలేనివారు నల్లా కింద స్నానాలు చేస్తున్నారు. ఈ పాకురు ప్రాంతం, నిరంతరం నల్లాలు ఆన్‌లో ఉండడంతో మరింత ప్రమాదకరంగా మారుతోంది.

సురక్షిత చర్యలకు విజ్ఞప్తి..

మంచిర్యాలతోపాటు జిల్లా వ్యాప్తంగా వచ్చే ప్రజల సురక్షత కోసం కనీసం సూచిక బోర్డులైనా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గుంతలు, పాకురు ప్రాంతాలను గుర్తించేందుకు తగిన హెచ్చరికలు, భద్రతా చర్యలు అవసరమని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు వెంటనే ఈ సమస్యను పరిష్కరించి, గోదావరి తీరాన్ని సురక్షితంగా మార్చాలని కోరుతున్నారు.

సెలవుల్లో.. శాశ్వత సెలవు

- ఇద్దరు చిన్నారులను మింగిన నీటి గుంత
- ప్రాణం తీసిన బాటిల్..
- కుమురంభీం జిల్లా తాటిపల్లిలో ఘటన


లక్ష్మి మృతదేహం


హన్షిక మృతదేహం


ప్రమాదానికి కారణమైన నీటి గుంత

కౌటాల: వేసవి సెలవుల నేపథ్యంలో గ్రామాల్లో పిల్లలంతా ఆటపాటలతో కాలక్షేపం చేస్తున్నారు. కొందరు స్వగ్రామంలో ఉండగా, కొందరు బంధువుల ఇళ్లకు వచ్చి.. ఇరుగు పొరుగు వారితో కలిసి ఆటలు ఆడుతున్నారు. ఈ క్రమంలో కుముంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తాటిపల్లిలో కూడా శుక్రవారం ఆటలు ఆడుతూ వెళ్లిన ఇద్దరు చిన్నారులను నీటిగుంత మింగేసింది. దీంతో సెలవుల్లో.. శాశ్వత సెలవు తీసుకున్నారు.

కూలీ కుటుంబాలు..

తాటిపల్లి గ్రామానికి చెందిన బోయర్ విశ్వనాథ్, మనీష దంపతులు కష్టజీవులు. విశ్వనాథ్ వార్ధా నదిలో చేపలు పడుతుండగా, మనీష కూలీ పని చేస్తూ కొడుకు జయ్, కూతురు లక్ష్మి(13)ని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. లక్ష్మి 7వ తరగతి పూర్తి చేసింది. ఇక మహారాష్ట్రలోని ఎటపల్లి గ్రామానికి చెందిన షిండే విజయ్, రత్నమాల దంపతుల కుమార్తె హన్షిక (11) వేసవి సెలవుల సందర్భంగా తాటిపల్లిలోని తన అత్తమామలు వాగడే నిరుత, నీతేష్ ఇంటికి 12 రోజుల క్రితం వచ్చింది.

బలి తీసుకున్న బాటిల్..

వేసవి సెలవుల్లో లక్ష్మి, హన్షిక, కరిష్మా, నవ్య అనే నలుగురు బాలికలు తాటిపల్లి బీసీ కాలనీలో కలిసి ఆడుకుంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో చెంబుల్లో నీళ్లు తీసుకుని వ్యవసాయ భూములవైపు బహిర్భూమికి వెళ్లారు. అనంతరం ఆడుకుంటూ సమీపంలోని చెరువు కుంటలో తవ్విన లోతైన గుంత వద్దకు చేరుకున్నారు. కరిష్మా, నవ్య గుంత ఒడ్డున నిలబడగా లక్ష్మి, హన్షిక నీళ్లలో తేలుతున్న వాటర్ బాటిల్ తీయడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో లక్ష్మి గుంతలో పడిపోగా ఆమెను రక్షించేందుకు హన్షిక చెయ్యి పట్టుకోవడంతో ఇద్దరూ నీటిలో మునిగిపోయారు.

గుండెలు పగిలే రోదనలు

గుంత ఒడ్డున ఉన్న కరిష్మ, నవ్య వెంటనే కుటుంబ సభ్యులకు, గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు వచ్చి నీటిలో గాలించి లక్ష్మి, హన్షికలను బయటకు తీసినప్పటికీ అప్పటికే వారు మృతి చెందారు. పదమూడేళ్లకే నీకు నూరేళ్లు నిండాయా తల్లీ అంటూ లక్ష్మి తల్లిదండ్రులు ఆమె మృతదేహంపై పడి విలపించారు. ఈ రోజు వద్దు, రేపు వెళ్తానన్నావు, బిడ్డా అంటూ హన్షిక అత్తమామలు గుండెలు బాదుకున్నారు. ఈ దృశ్యం అందరి కళ్లను చెమర్చింది.

పోలీసుల దర్యాప్తు

ఎస్సై విజయ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. లక్ష్మి తల్లి మనీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాలను సిర్పూర్(టి)లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆసుపత్రి వద్ద హన్షిక తల్లిదండ్రులు 'సెలవులకు వచ్చి శాశ్వతంగా సెలవు తీసుకున్నావా' అంటూ బోరున విలపించారు. ఈ ఘటనతో తాటిపల్లిలో విషాదం నెలకొంది.

చెక్‌బౌన్స్ కేసులో ఇద్దరికి జైలు

మంచిర్యాలక్రైం: చెక్ బౌన్స్ కేసులో మంచిర్యాల కోర్టులు ఇద్దరికి శుక్రవారం జైలుశిక్ష విధించాయి. మంచిర్యాలలోని కాలేజీ రోడ్‌కు చెందిన పాయిశెట్టి రవీందర్ దగ్గర నస్పూర్‌కు చెందిని గట్టు రాజయ్య రూ.3 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు చెల్లించేందుకు నమ్మకంగా చెక్కు ఇచ్చాడు. ఒప్పందం ప్రకారం తీసుకున్న డబ్బులు చెల్లించక పోవడంతో చెక్కు బ్యాంకులో డిపాజిట్ చేయగా అవి చెక్స్ బౌన్స్ అయింది. దీంతో రాజయ్యపై 2018లో కేసు వేయగా విచారణ అనంతరం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.నిరోష రాజయ్యకు ఏడాది సాదారణ జైలు శిక్షతోపాటు రూ.6 లక్షలు చెల్లించాలని తీర్పు వెల్లడించారు. బెల్లంపెల్లి కాల్‌టెక్స్‌కు చెందిన వొల్లాల స్వప్న దగ్గర మంచిర్యాల అశోక్‌రోరోడ్‌కు చెందిన పుస్కూరి లక్ష్మి రూ.6 లక్షలు అప్పుగా తీసుకుంది. అప్పు చెల్లించేందుకు చెక్కు ఇచ్చింది. అప్పు చెల్లించకపోవడంతో చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయింది. దీంతో స్వప్న 2017లో కేసు వేయగా విచారణ అనంతరం లక్ష్మికి ఏడాది సాదారణ జైలు శిక్షతోపాటు రూ.6 లక్షలు చెల్లించాలని జడ్జి నిరోష తీర్పు వెల్లడించారు.

చిట్టీల పేరుతో మోసం చేసిన వ్యక్తికి..

మంచిర్యాలక్రైం: చిట్టీల పేరుతో మోసం చేసిన వ్యక్తికి రెండేళ్లే సాధారణ జైలుశిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ జూనియర్ సివిల్ జడ్జి నిరోష శుక్రవారం తీర్పు ఇచ్చారని సీఐ ప్రమోద్‌రావు తెలిపారు. బెల్లంపెల్లికి చెందిన గాజుల సుజాత పట్టణానికి చెందిన నాగరాజు మంచిర్యాలలోని ధనసిద్ధి చిట్ ఫండ్ మేనేజర్ జిలకర రామ్మోహన్‌రావుని పరిచయం చేయించి మూడో నెల లేదా నాలుగో నెలలో చిట్టీ ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. దీంతో సుజాతను రూ.10 లక్షల చిట్టీలో సభ్యురాలిగా చేర్పించాడు. నెలకు రూ.20 వేల చొప్పున రూ.92,750 చెల్లించింది. కొద్ది రోజుల తర్వాత చిట్‌ఫండ్ కార్యాలయానికి వెళ్లి చూడగా ఎత్తేసినట్లు తెలిసింది. మేనేజర్‌కు ఫోన్‌చేయగా వేరే చోటికి మార్చామని చెప్పాడు. మరోసారి ఫోన్ చేసి డబ్బులు కావాలని అడిగితే దిక్కున్నచోట చెప్పుకోమని బెదిరించాడు. దీంతో సుజాత పోలీస్ స్టేషన్‌లో 2016, మార్చి21న ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలుచేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో రామ్మోహన్‌రావుకు రెండేళ్ల సాధారణ జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.